## క్లుప్తంగా

### ఘనంగా నాగేంద్రస్వామి కల్యాణోత్సవం



తాడేపల్లిరూరల్: నవులూరులోని నాగేంద్ర స్వామి పుట్ట తోటలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం నాగేంద్రస్వామి, అశ్వర్థ నారాయణుల కల్యాణ మహోత్సవాన్ని తూటుపల్లి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణారెడ్డి, రత్నకుమారి దంపతులు మాట్లాడుతూ మంగళగిరి, విజయవాడ, గుంటూరు నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారని తెలిపారు. ఆలయం ఆవరణలోని నవ నాగేంద్రులు, 23 నాగేంద్ర స్వామి విగ్రహాలు కొలువై ఉన్న పీతాల వద్ద స్వామి వార్ల విగ్రహాలకు భక్తులు పాలాభిషేకం నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారన్నారు. మహిళా భక్తులు కార్తిక దీపాలను వెలిగించి పూజలు చేశారని, అనంతరం అన్నదాన నిర్వహించామన్నారు.

### ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం చిర్రావూరు గ్రామంలో ధాన్యం కల్లాల వద్ద పలువురు రైతులను కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటా ధాన్యం ధర రూ.2,340 ప్రకారం 75 కేజీల ధాన్యానికి రూ.1,740 ఇవ్వాల్సి ఉండగా రూ.1,400 నుంచి రూ.1350కు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం తాడేపల్లి సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ పాల్గొన్నారు.

### ఘనంగా జొన్నాదుల వన సమారాధన



తాడేపల్లిరూరల్ : పెదవడ్లపూడి డీబీఎస్ గార్డెన్‌లో జొన్నాదుల వంశీకుల వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. జొన్నాదుల వంశీకుల ప్రముఖులు మాట్లాడుతూ మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారని, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. జొన్నాదులు చలపతిరావు, నాగేశ్వరరావు, వీర రాఘవులు, సాంబశివరావు, బాలకృష్ణ, లక్ష్మీ పెరుమాళ్లు, లెనిన్, రత్నం, శ్రీనివాసరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

### సీఎం సహాయ నిధి నగదు చెక్కులు పంపిణీ



తాడేపల్లిరూరల్ : ఇప్పటం గ్రామంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు గాజుల రాంబాబు ఆదివారం అందజేశారు. వీరంకి వెంకటరత్తయ్య, సాదు వెంకట శివనాగ లక్ష్మీ దుర్గకు నగదు చెక్కులను ఇంటికెళ్లి అందజేశామని తెలిపారు. గాజుల నగేష్, కాటూరి నాగేశ్వరరావు, జెముడుగాని రత్తయ్య, జముడుగాని మహేంద్రగౌడ్ పాల్గొన్నారు.

### ఘనంగా గంగానమ్మ కొలుపులు



కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగిలో ఆదివారం కులమత భేధాలు లేకుండా గంగానమ్మ కొలుపులు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయాన్నే కొలుపులను పురస్కరించుకొని గంగానమ్మ ప్రతిరూపమైన ఘటాన్ని గ్రామంలో ప్రతి వీధిలో మేళ తాళాలతో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు పాడి పశువులతో ఆలయం చుట్టూ తిరుగుతూ పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. పిల్లలు, మహిళలు మెడలో గారెలు, బూరెలు దండలుగా ధరించి తలపై మొలకెత్తిన గింజలు మూకుడుతో అడుగులు మడుగులు పాటిస్తూ మొక్కుబడులను తీర్చుకున్నారు.

## రాజధాని పేరుతో

# ఇంకెన్ని అప్పులు చేస్తారో!

- ఎన్ని జన్మలెత్తినా చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేరు
- మరోసారి ఆయన జిమ్మిక్కులను ప్రజలు నమ్మి ఓటేశారు
- కూటమి ప్రభుత్వం హామీల అమలుకు పోరాడుదాం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు



సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలతో మరోసారి ప్రజలను మోసగించారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేవిధంగా వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు ప్రతి ప్రాంతంలో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని మంగళగిరి నియోజకవర్గ ఆ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నియోజకవర్గ ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశం ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తాడేపల్లి రూరల్ వైఎస్సార్ సీపీ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు జిమ్మిక్కులను నమ్మి ప్రజలు ఓట్లు వేశారన్నారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతికి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన చేశారని, చంద్రబాబు కార్పొరేట్ సంస్థలను పోషించే వ్యక్తి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాల్లో ఒక్కటి మినహా.. మిగిలినవి ఇంతవరకు ప్రజలకు అందలేదని గుర్తుచేశారు. ఎన్ని జన్మలెత్తినా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టోను నూరుశాతం అమలు చేయలేరని స్పష్టం చేశారు. మ్యానిఫెస్టోని ఖురాన్, బైబిల్, భగవద్గీతలా భావించి గడిచిన ఐదేళ్లలో 99 శాతం అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ పార్టీ విధానాల్లో మార్పులు రావాలని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ సహకరించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పార్టీ అధినేత వైఎస్ జగన్, నియోజకవర్గ ఇన్‌చార్జి వేమారెడ్డి అండగా ఉంటారని కార్యకర్తలకు భరోసానిచ్చారు. వరల్డ్ బ్యాంక్ నుంచి రూ.15 వేలు కోట్లు అప్పు తీసుకొచ్చి రాజధాని మునిగిపోకుండా అందులో రూ.8వేల కోట్లు పెట్టి కొండవీటి వాగు విస్తీర్ణానికి ఖర్చు చేస్తున్నారన్నారు. రాజధాని అభివృద్ధి పేరుతో ఇంకా ఎన్ని అప్పులు చేస్తారో అని విస్మయం వ్యక్తం చేశారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను కూటమి నాయకులు నేరుగా, పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని, వాటికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్ : ఉపాధ్యాయులకు నేషనల్ బిల్డర్స్ అవార్డు ప్రదాన ప్రదానోత్సవం ఆదివారం మంగళగిరిలోని లిటిల్ విలేజ్ హోమ్‌లో నిర్వహించారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విశిష్ట, ముఖ్య అతిథిలుగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్, పీడీజీ అన్నే రత్న ప్రభాకర్ పాల్గొన్నారు. రోటరీ ఇండియా లిటరసీ మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులు 29 మందిని ఎంపిక చేసి, ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. కుమారి లేఖశ్రీ భరతనాట్యం అలరించింది. అనిల్ చక్రవర్తి, ఎస్.బాబు, డాక్టర్ వంశీకృష్ణ, టీవీ నారాయణ, అందే మురళీమోహన్, అందే రేవంత్‌కుమార్, శ్రీభాష్యం రంగనాథ్, కేవీఎస్ ప్రకాశరావు, టి.సతీష్, షేక్ మన్సన్, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

## 3,604 మంది ఉద్యోగాలకు ఎంపిక



నిర్వాహకులకు మెమెంటోలు అందజేత

తాడేపల్లిరూరల్ : వీటీజేఎం, ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 11,500 మందికి పైగా హాజరయ్యారని, 3,604 మందికి వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందారు. 60కు పైగా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు. జాబ్ మేళాకు సహకరించిన ధ్రువ్ కన్సల్టెన్సీ సర్వీసెస్, వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల, సీకే హైస్కూల్ యాజమాన్యాలకు.. జాబ్ మేళాకు హాజరైన యువతకు భోజన సదుపాయం కల్పించిన జంజనం నాగమల్లేశ్వరరావుకు, సహకరించిన ప్రభుత్వ అధికారులకు, పోలీస్ సిబ్బందికి, వలంటీర్లకు, తెలుగు యువత నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అలీమ్ బాషా, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మతోన్మాద శక్తులను ఓడించాలి



జెండాను ఆవిష్కరిస్తున్న పాశం రామారావు

తాడేపల్లిరూరల్ : దేశంలోని మతోన్మాద శక్తులను బలహీన పర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమారెడ్డి భవన్‌లో మహా సభను నిర్వహించారు. తొలుత బోసు బొమ్మ సెంటర్‌లో పతాకాన్ని ఆవిష్కరించి, అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వినియోగించి, ప్రతిపక్ష పార్టీ నాయకులను బీజేపీ ప్రభుత్వం జైళ్ల పాలు చేస్తోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ, రవి మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఉద్యమం విజయవంతం కావాలని కోరారు.రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, నాయకులు దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో పేదలకు 20 వేల మందికి ఇళ్ల స్థలాలు దక్కాయి అంటే సీపీఎం వల్లనేనని స్పష్టం చేశారు. అనంతరం సీపీఎం తాడేపల్లి పట్టణ కమిటీ 11 మందితో ఏర్పాటయ్యింది. పట్టణ కార్యదర్శి సభ్యులుగా బూరుగు వెంకటేశ్వర్లు, జి.సుబ్బారెడ్డి, డి. శ్రీనివాస్ కుమారి, కె. కరుణాకర్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పి.గిరిజ, డి.విజయ భాస్కర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వై.బర్నబాస్, ఎ.శౌరి బర్నులం, కె.బాబూరావు, దర్శనపు విజయబాబును ఎన్నుకున్నారు. వేముల దుర్గారావు, ఉష, కోట బాబూరావు, వై.మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఓటర్లకు ప్రత్యేక క్యాంపులు



ఫిరంగిపురం: సమ్మర్ రివిజన్ క్యాంపు రెండు రోజుల పాటు మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. అమీనాబాద్, రేపూడి, మేరికపూడి, నుదురుపాడు గ్రామాల్లోని బీపీఎల్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. 17 గ్రామాల్లో 66 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. దీని ద్వారా ప్రతి ఒక్కరూ నూతన ఓటు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపు చేసుకోవచ్చని తెలిపారు.

## సీపీఎం విస్తృత ప్రచారం



తాడేపల్లిరూరల్ : గుంటూరులో మంగళవారం నిర్వహించనున్న ప్రదర్శన, సభను జయప్రదం చేయాలని ఆదివార దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి, చిలువూరు తదితర ప్రాంతాల్లో సీపీఎం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ..కార్పొరేట్ శక్తులను పోషిస్తోందని విమర్శించారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా 500 జిల్లాలో భారీ ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఇతర ప్రజాసంఘాలు సమీకృతమై వ్యవసాయ పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలని తదితర న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గుంటూరు శంకర్ విలాస్ నుంచి ప్రదర్శన, మార్కెట్ సెంటర్‌లో సభ జరుగుతుందని తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, వై. బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి, జి.బాలచంద్రులు, వెంకటేశ్వరరావు, ఎం.మంగయ్య పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని ఆయన పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

## వాసవీ మాత ఆలయంలో కోటి దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

తెనాలి: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం రాత్రి కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవాసవీ మాత ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రతువులో వందలాది మహిళలు పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకటవేణుగోపాలరావు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సభ్యులు మద్దాలి యశ్వంత్ గుప్తా, కోడూరు రామబ్రహ్మం, నాళం దిలీప్‌కుమార్, కొమ్మూరు సురేంద్ర, ఎం.సాయివెంకటేష్, బియ్యపు సాయి, మద్దాలి ప్రణీత్, చేబ్రోలు కిశోర్, విజయ్ కుమార్, సురేష్ కుమార్, గురవయ్య, అన్నా వెంకటేష్ బాబు, ఫణి సంపత్, కే మహేష్ కుమార్ , చీదేళ్ల పవన్ కుమార్, ఆలపాటి విజయసాయి, దినేష్ కుమార్, దేసు హాసిని, శ్రీనాగ ప్రశాంతి, దివ్య నాగశ్రీ , దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో అగ్ని ప్రమాదం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కోనేరు సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హెల్త్‌వెల్ నెస్ సెంటర్ నుంచి పొగలు, శబ్దాలు వస్తున్నాయంటూ పొలాలకు వెళ్తున్న వారు గమనించి అక్కడ పనిచేసే ఆరోగ్య సిబ్బంది తెలిపారు. దీంతో సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి..వైద్యాధికారికి, విద్యుత్, పోలీసు శాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. సీఐ రవీంద్రబాబు, విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కానీ, అప్పటికే గదిలోని ఫర్నీచర్, రికార్డులు, కిటికీలు, బల్లలు, మందులు, మోటారు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుతో అగ్ని ప్రమాదానికి కారణాలు పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు వైద్యాధికారి శ్వేత తెలిపారు.

## మంత్రి సత్యకుమార్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర మంత్రి సత్యకుమార్ శాసన మండలిలో హజ్ గురించి కించపరిచే విధంగా మాట్లాడి యావత్ ముస్లిం మనోభావాలు దెబ్బతీశారని, ముస్లిం సమాజానికి ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్రను కించపరిచే విధంగా వంద ఎలుకలు తిన్న పిల్లి పాప పరిహారం కోసం హజ్ యాత్రకు వెళ్లిందంటూ మంత్రి మాట్లాడారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ జీవిత కాలంలో ఒక్కసారైనా తప్పనిసరిగా ఆర్థిక స్తోమత ఉన్నా లేకున్నా.. ముస్లింలు అత్యంత పవిత్రంగా చేసే హజ్ యాత్ర గురించి సామెతల రూపంలో కించపరచడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ మస్తాన్ వలీ, షేక్ జిలాని పాల్గొన్నారు.

## పునర్వైభవం తీసుకొద్దాం



మాట్లాడుతున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వజ్రబాబు

తాడికొండ: కష్టపడి పనిచేసి రాజధాని ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తీసుకొద్దామని ఆ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరులోని మల్లికార్జునపేటలో ఉన్న తన కార్యాలయంలో తుళ్లూరు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీకి కార్యకర్తలే పునాదులని, గతంలో జరిగిన తప్పొప్పులను పక్కనబెట్టి భవిష్యత్తులో పార్టీ కోసం ఏం చేయాలనే దానిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. దీంతో తాడికొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. నూతన కమిటీల ఎన్నిక ప్రక్రియను ప్రారంభించేందుకు కసరత్తు ప్రారంభించాలన్నారు. మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి, గ్రామ పార్టీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తున్నారని, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులపై ఏ ఒక్కరూ భయపడవద్దని ధైర్యంగా ముందుకెళ్లాలని సూచించారు.

## ప్రపంచ బ్యాంక్ అప్పును కేంద్రమే చెల్లించాలి



మాట్లాడుతున్న బాబూరావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అభివృద్ధికి ప్రపంచ బ్యాంక్ ఇస్తున్న అప్పును కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. ఆదివారం ఉండవల్లిలో రాజధాని డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి బాబూరావు మాట్లాడుతూ రాజధాని రైతులు, కార్మికుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్ వెంటనే అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములకు ఇతరులతో సమానంగా ప్యాకేజీ ఇవ్వాలని, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, రాజధాని అభివృద్ధి పనుల్లో స్థానికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు, ఎం.రవి, ఎం.భాగ్యరాజు, ఈమని రామారావు, సీహెచ్. సుందరరావు, పేరం బాబూరావు, చేవూరి నంద, కట్టపోగు వెంకటేశ్వర్లు, ఎర్రమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతులకు ప్రకృతి వ్యవసాయ పాఠాలు



ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శనలో తెలంగాణ రైతులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు, పెదపాలెం గ్రామాల్లో తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ,వరంగ్ జిల్లాల రైతులకు ప్రకృతి వ్యవసాయ పాఠాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎన్ఆర్‌వో ప్రకాష్ మాట్లాడుతూ రేవేంద్రపాడు గ్రామంలోని రైతు నాగిని ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని సందర్శించి, బీజామృతం, ద్రవ, ఘన జీవామృతం, నీమాస్త్రం, విత్తన గుళికల తయారీ, ఉపయోగం, వాడే పద్ధతులను వివరించామని తెలిపారు. పెదపాలెం గ్రామంలో రైతు కృష్ణప్రసాద్ 40 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిన వరి పంట, నూతక్కి గ్రామంలో ఉషారాణి ఎన్‌పీఎం షాప్‌ను, శ్రీనివాసరెడ్డి అరటి, పసుపు పంటలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఎన్ఆర్‌వో శ్రీనివాస్, హ్యూమయున్, సతీష్, ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయం నుంచి డీఎల్‌ఎంపీ, ఎన్ఎఫ్ఎలు, ఎంటీలు, ఐసీఆర్‌పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో విశ్రాంత ప్రిన్సిపల్ మోజెస్

ఫిరంగిపురం: విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలని ఆర్‌సీజేసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎం. మోజేస్ అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాల మైదానంలో ఆదివారం మండల స్థాయి ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. అండర్–14, 19 విభాగాల్లో పలు జట్లు తలపడ్డాయి. విశ్రాంత పీఈటీ జెట్టి సురేంద్ర బాబు, నాని, సురేష్, ప్రభుదాసు పాల్గొన్నారు.

## బాలుర హైస్కూలు విద్యార్థికి ఉత్తమ ఎన్‌సీసీ అవార్డు

తెనాలి: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం కేడెట్‌లకు ఇచ్చే ఉత్తమ అవార్డు స్థానిక కొత్తపేటలోని శ్రీరావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలు విద్యార్థి యడ్ల తరుణ్‌కు లభించింది. జూనియర్ డివిజన్ విభాగంలో ఈ అవార్డును గెలుచుకున్న తరుణ్ ఆదివారం గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు. వరుసగా తమ పాఠశాలకు చెందిన కేడెట్లే ఉత్తమ అవార్డును గెలుచుకుంటున్నట్లు ఎన్‌సీసీ అధికారి పఠాన్ సర్దార్ తెలియజేశారు. తరుణ్‌ను ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, ఉపాధ్యాయులు అభినందించారు.